క్లుప్తంగా

టీఎస్ఐఐసీ చైర్మన్‌కు పరామర్శ



బాలమల్లును పరామర్శిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటకమాన్: టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు మాతృమూర్తి కమలమ్మ ఇటీవల మరణించడంతో సిద్దిపేటలో వారి కుటుంబ సభ్యులను ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు మంగళవారం పరామర్శించారు. మంత్రి వెంట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన సంతోషీమాత ఆలయ పాలకవర్గం

సిద్దిపేటజోన్: పట్టణంలోని సంతోషీమాత ఆలయ నూతన పాలకవర్గ సభ్యులు మంగళవారం క్యాంపు కార్యాలయంలో మంత్రి హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ నవీన్, సభ్యులు సత్యం, ప్రభాకర్, అమర్‌నాథ్, సువర్ణలు పాలకవర్గ సభ్యులుగా అవకాశం కల్పించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలు

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలుగా నిలుస్తాయని ఎంపీపీ గజ్జెల సాయిలు, డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య అన్నారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం గ్రంథాలయాన్ని ప్రారంభించారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తకాలను వివిధ దినపత్రికలను పరిశీలించి చదివారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నమిలె భాస్కరాచారి, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ బోయ శ్రీనివాస్, కో–ఆప్షన్ మెంబర్ ఎండీ. అహ్మద్, బీఆర్ఎస్ నాయకులు లింగం, పాపని సురేశ్‌గౌడ్, జెన్నారెడ్డి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్

రాయపోలు(దుబ్బాక): మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. రాయపోలు మండలం సయ్యద్‌నగర్‌లో మంగళవారం పర్యటించిన ఆయన ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడారు. మైనార్టీ విద్యార్థుల కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కార్పొరేట్ స్థాయిలో మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేసి ఉచిత విద్య అందిస్తుందన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో దుబ్బాకలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమన్నా రు. ఆయన వెంట నాయకులు మంజూరు, బాబు, గౌస్, సల్మాన్ తదితరులు ఉన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

నంగునూరు(సిద్దిపేట): మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయడంతోపాటు కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ మంగళవారం పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా నాయకురాలు బాలనర్సవ్వ మాట్లాడుతూ.. జూలై 6 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం అన్ని రంగాల కార్మికులకు పీఆర్సీ అమలు చేస్తున్నా గ్రామ పంచాయతీ కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో రాజమౌళి, దేవవ్వ, నర్సింలు పాల్గొన్నారు.

ఊరకుక్కల దాడిలో 12 మేకలు మృతి

మిరుదొడ్డి(దుబ్బాక): ఊరకుక్కల దాడిలో 12 మేకలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కొండాపూర్‌లో మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సోమగల్ల భాస్కర్‌కు చెందిన మేకల మంద కొట్టంలోకి ఊర కుక్కలు చొరబడ్డాయి. మేకలను కుక్కలు విచక్షణారహితంగా కొరికివేయడంతో 10 మేకలు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన ఎర్రోల్ల రాజుకు చెందిన మందపై కుక్కలు దాడిచేసి కొరికివేయడంతో రెండు మేకలు మృతి చెందాయి. జీవాలే జీవనాధారంగా బతుకుతున్న పరిస్థితుల్లో కుక్కల దాడితో ఉపాధి కోల్పోయామని విలపించారు. తమను ఆదుకోవాలని బాధితులు వేడుకున్నారు.

గంజాయి కేసులో ఇద్దరి రిమాండ్

చేర్యాల(సిద్దిపేట): గంజాయి కేసులో పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం సీఐ మాట్లాడుతూ.. గత నెల 19వ తేదీన చుంచనకోట గుట్టల్లో గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డ కేసులో పరారీలో ఉన్న ఇద్దరు నిందితులు యాట స్వామి(రాజు), చెంచు రాజేశ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సర్కార్ బడుల్లో సకల వసతులు

జిల్లా వ్యాప్తంగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పాఠశాలల్లో విద్యాదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మన ఊరు–మన బడి కార్యక్రమంలో మౌలిక వసతులు కల్పించిన పాఠశాలలను, రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. అనంతరం విద్యార్థినులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పాఠశాలల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని పలువురు కొనియాడారు.

మర్కూక్(గజ్వేల్): మన ఊరు–మన బడితో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పించామని ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యాదినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని చేబర్తి, వర్దరాజ్‌పూర్ గ్రామంలో మన బడిలో నిర్మించిన పాఠశాలలను ప్రారంభించారు. గజ్వేల్: రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల రూపురేఖలు మార్చిందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అక్కారం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన విద్యా దినోత్సవానికి హాజరై ప్రసంగించారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మన బడి కింద మౌలిక వసతులు ఏర్పాటు చేసిన ఇటిక్యాల ప్రాథమిక పాఠశాలను ఆయన ప్రారంభించారు.

ములుగు(గజ్వేల్): విద్యావ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు పేర్కొన్నారు. మండల కేంద్రమైన ములుగు, అలియాబాద్ పాఠశాలల్లో మన ఊరు–మన బడి కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన తరగతి గదులు, రీడింగ్ కార్నర్‌లను మంగళవారం వారు ప్రారంభించారు. అదేవిధంగా విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలను అందజేశారు.

దుబ్బాకరూరల్: మండలంలోని ఆకారం గ్రామంలో మన ఊరు మన బడి కార్యక్రమంలో నూతనంగా నిర్మించిన జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలను ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో రూపుదిద్దుకున్నాయన్నారు.



కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి హైస్కూల్లో నృత్యం చేస్తున్న విద్యార్థులు



గజ్వేల్: విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



మర్కూక్(గజ్వేల్): వర్దరాజ్‌పూర్‌లో పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి



హుస్నాబాద్: విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న చైర్‌పర్సన్ రజిత



దుబ్బాకరూరల్: పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇందిరానగర్ పాఠశాలలో..



కోహెడరూరల్(హుస్నాబాద్): డిజిటల్ తరగతులను ప్రారంభిస్తున్న సర్పంచ్ నాగేశ్వరి



చిన్నకోడూరులో..



వర్గల్ హైస్కూల్‌లో డిజిటల్ బోర్డులను ప్రారంభిస్తున్న ఎంపీపీ లత, జెడ్పీటీసీ బాలూయాదవ్



గజ్వేల్‌రూరల్: చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తున్న ఏసీపీ రమేశ్

మారిన పాఠశాలల రూపురేఖలు

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా సర్కార్ బడులను మౌలిక సదుపాయాలతో పాటు సాంకేతికపరంగా, చదువపరంగా ఔరా అన్నట్లుగా తీర్చిదిద్దాయని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో డిజిటల్ పాఠాలు ప్రారంభించి, విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటుబుక్స్, పదిలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. అనంతరం ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన రాగి జావను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అనిత, ఎంపీపీ లకావత్ మానస, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజని, కౌన్సిలర్లు నళినిదేవి, పెరుక భాగ్యరెడ్డి, హెచ్‌ఎంలు మనీల, వెంకటయ్య, అన్నపూర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డిజిటల్ పాఠాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో మెరుగైన బోధన అందుతుందని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కడవేర్గు ఎంపీపీఎస్‌లో రూ.45.36లక్షల వ్యయంతో చేపట్టిన మన ఊరు మన బడి పనులను ఎమ్మెల్యే ముత్తిరెడ్డి ప్రారంభించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం ఉమారాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసిన ఎమ్మెల్యే ప్రముఖులకు నివాళులర్పించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న రాగిజావను పంపిణీ చేశారు. యూనిఫామ్ అందించారు. అంతకుముందు పట్టణ కేంద్రంలోని పెద్దచెరువు మత్తడి కాల్వ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రైతులు తమ పట్టా భూముల్లో నుంచి కాల్వ తీయొద్దని కోరగా అధికారులు సర్వే నిర్వహించి పాత అలైన్‌మెంట్ ప్రకారం పనులు చేస్తారని వారికి నచ్చజెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, సర్పంచ్ కొమ్ముల స్వప్న, ఎంపీటీసీ గదరాజు యాదగిరి, మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఎల్లారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ తాల్లపల్లి నర్సయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు నాజర్, రైతుబంధు జిల్లా సభ్యుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



పాఠశాలలో చేపట్టిన పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి తదితరులు

దుబ్బాక అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాక: దుబ్బాక అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తానని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి నుంచి ధర్మారం వరకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజనలో భాగంగా సుమారు రూ.4కోట్ల నిధులతో చేపట్టిన బీటీరోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 20 సంవత్సరాల నుంచి గుంతల రోడ్డుతో అవస్థలు పడుతున్నా వాహనదారుల సమస్య నేటితో తీరిందన్నారు. నిరంతరం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు తీర్చడానికి కృషి చేస్తామన్నారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతలో లోపాలుంటే కాంట్రాక్టర్‌పై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లారెడ్డి, నాయకులు తదితరులున్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కొమురవెల్లి(సిద్దిపేట): మిషన్ భగీరథ నీటి సరఫరాలో అలసత్వం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని అయినాపూర్ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామస్తులతో కలిసి మిషన్ భగీరథ ట్యాంకు ఎక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో కొంత కాలంగా మిషన్ భగీరథ నీరు రావడంలేదని అధికారులకు తెలిపితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఇంటికి శుద్ధమైన నీటిని అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా అమలు చేయడంలో ప్రభుత్వ అధికారులు విఫలం అవుతున్నారని మండిపడ్డారు. గ్రామంలో మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో నాలుగు మోటార్ల ద్వారా నీరు అందించాల్సి వస్తుందని, దీంతో విద్యుత్ బిల్లు పెరుగిపోతుందన్నారు. కార్యక్రమంలో రవీందర్, ఎల్లయ్య, ఎల్లం, రాములు, దండు రవి, ఎర్రోల్ల నర్సింహులు, కనకయ్య పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని మునిగడపకు చెందిన మరాఠీ నర్సింలు(58) ఈ నెల 17న ఇంటి నుంచి పనికి వెళ్తున్నానని చెప్పి మూడురోజులు గడిచినా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తమ బంధువులకు ఫోన్ చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కృష్ణమూర్తి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డీజిల్ చోరీ

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామ పంచాయతీ ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్ల టైర్లలో గాలి తీసి, డీజిల్ చోరీ చేసిన ఈ సంఘటన అక్కన్నపేట మండలం కేశవాపూర్ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ పంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్ల టైర్లలో గాలి తీసి, డీజిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. మంగళవారం ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి సుమలత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, డీజిల్ చోరీకి గురికావడంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు వారు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు



జనగామ గ్రామానికి వెళ్లే రోడ్డుకిరువైపులా నరికివేసిన చెట్లు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం జనగామ గ్రామంలో రోడ్డుకిరువైపులా ఏపుగా పెరిగి పచ్చదనంతో కళకళలాడుతున్న చెట్లను పలువురు నరికివేశారు. దాదాపు మూడేళ్ల కిందట జనగామ స్టేజీ నుంచి గ్రామానికి వెళ్లే రోడ్డుకిరువైపులా హరితహారంలో మొక్కలు నాటారు. దీంతో మొక్కలు పెద్దయి చెట్లుగా పెరిగాయి. ఈ క్రమంలో విద్యుత్ తీగలకు చెట్లు అడ్డొస్తున్నాయని సుమారుగా 30 నుంచి 40 పచ్చని చెట్లను నరికివేశారు. ఎలాంటి ముందుచూపు ఆలోచనలు చేయకుండా విద్యుత్ తీగల కింద హరితహారం మొక్కలను నాటి పెరిగిన తర్వాత ఇలా నరికివేయడం చూసిన ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపడుతున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు పర్యవేక్షణ చేసి చెట్లను తొలగించడకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

కొండపాక(గజ్వేల్): మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన ముగ్గురు వ్యక్తులకు సిద్దిపేట మార్నింగ్ కోర్టు జడ్జి రమేశ్‌బాబు మంగళవారం జైల్ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని కుకునూరుపల్లి ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.. కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పలుమార్లు పట్టుబడిన ఒకరికి ఒకరోజు జైల్ శిక్ష, మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన మరో ఇద్దరు వ్యక్తులకు 2 రోజులు జైల్ శిక్షను విధిస్తూ తీర్పు చెప్పారన్నారు. ముగ్గురు వ్యక్తులను సబ్‌జైల్‌కు తరలించామన్నారు.

రైతు కుటుంబానికి చేయూత

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండలం సూరంపల్లిలో ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు బొల్లం లింగం కుటుంబాన్ని మంగళవారం కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి, రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట నాయకులు తదితరులున్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): 'హుస్నాబాద్‌లో ఆర్డీఓ, పాలిటెక్నిక్ కళాశాల, డిగ్రీ కళాశాల, ఆస్పత్రి ఆధునీకరణ తదితర వాటిని నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తీసుకొచ్చానని, కానీ తామే తీసుకొచ్చినట్లు ప్రస్తుత ఎమ్మెల్యే చెప్పుకోవడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని ధర్మారం గ్రామంలో పల్లెపల్లెకూ ప్రవీణ్ అన్న.. గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ అధికారంలో వచ్చిన తర్వాత చేసే పలు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏక కాలంలో రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తామన్నారు. అదేవిధంగా రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మండల అధ్యక్షుడు అయిలయ్య ఉన్నారు.

యువతి అదృశ్యం



బండమీది రమాదేవి

కొండపాక(గజ్వేల్): ఇస్తారాకుల కంపెనీలో పని కోసం వెళ్లిన బండమీది రమాదేవి (22) అదృశ్యమైనట్లు త్రీటౌన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని దుద్దెడకు చెందిన బండమీది రమాదేవి ఈ నెల 19న ఇస్తారాకుల కంపెనీలో పనికి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారిని సంప్రదించగా ఆచూకీ లభించలేదన్నారు. అన్న నరేశ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

శిలాఫలకంపై పేరు లేదని..

కొండపోచమ్మ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం

జగదేవ్‌పూర్(గజ్వేల్): 'మన ఊరు–మన బడి' పాఠశాల ప్రారంభ శిలాఫలకంపై తన పేరు లేదని కొండపోచమ్మ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. మండలంలోని చాట్లపల్లి ప్రాథమిక పాఠశాలను దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రారంభానికి సిద్ధం చేశారు. పాఠశాలలో జాతీయ జెండాను ఎగురవేసి విద్యార్థులకు రాగి అంబలి అందజేశారు. అనంతరం గ్రంథాలయం, పాఠశాలను ప్రారంభించేందుకు ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి కోసం వేచి చూస్తున్నారు. ఇంతలోనే ఎంపీపీ బాలేషంగౌడ్, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి పాఠశాలకు వచ్చారు. అప్పటికే కొండపోచమ్మ చైర్మన్ శిలాఫలాకాన్ని చూసి తన పేరు లేకపోవడంపై ఎంపీపీ బాలేషంగౌడ్, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయారు. వారి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో శిలాఫలాకాన్ని రాయితో కొట్టి ధ్వంసం చేసి పాఠశాల వెనకలో పడేశారు. అదేవిధంగా స్థానిక ఎంపీటీసీ మసూరి కావ్య దర్గయ్యకు బదులు భూమల్ల కావ్యదుర్గయ్య అంటూ తప్పుగా రావడంతో ఆమె భర్త దర్గయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న ఎంపీడీఓ శ్రీనివాస్ చూస్తుండిపోయారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం నుంచి పార్టీలో పనిచేస్తున్నానని, తమ గ్రామంలో తన పేరు శిలాఫలకంపై వేయకపోవడంపై మండిపడ్డారు. ఈ విషయంపై ఎంపీడీఓను వివరణ కోరగా సంబంధిత అధికారులకే తెలుసని సమాధానం చెప్పారు. ఏఈని ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు. దీంతో కార్యక్రమాన్ని వాయిదా వేశారు.



శిలాఫలకాన్ని తీసేస్తున్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

గాగిళ్లాపూర్‌లో బోనాల పాట చిత్రీకరణ

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని గాగిళ్లాపూర్ గ్రామానికి చెందిన జానపద కళాకారుడు ఏలూరి కృష్ణబాబు, ప్రముఖ జానపద పాటల కొరియోగ్రాఫర్ జానులిరీ తదితర నటీనటులతో మంగళవారం గ్రామంలో బోనాల పాటను చిత్రీకరించారు. ఈ పాట చిత్రీకరణను ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. యువతీ, యువకులు తమ ప్రతిభను కనబర్చేందుకు ఈ జానపద గీతాల చిత్రీకరణ వంటివి ఎంతగానో దోహదపడతాయన్నారు. కళాకారులు తమ కళ ద్వారా తెలంగాణ ఔనత్యాన్ని చాటి చెప్పాలన్నారు. కాగా బోనాల పాట చిత్రీకరణను గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, సర్పంచ్ బొల్లు కృష్ణవేణిచంద్రమౌళి, ఉపసర్పంచ్ మాధవిగోపాల్, ప్రొడ్యూసర్ ఏలూరి కృష్ణ, నాయకులు మేక ఉమామహేశ్వర్, పుప్పాల బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



బోనాల పాట చిత్రీకరణను ప్రారంభిస్తున్న ఎంపీపీ కృష్ణారెడ్డి

ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం

గజ్వేల్‌రూరల్: గ్రామ దేవతల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని దాచారం గ్రామంలో చేపడుతున్న ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి మాజీ ఎంపీపీ చిన్నమల్లయ్య, మాజీ సర్పంచ్ రాంరెడ్డిలకు ఆయన మంగళవారం రూ.50వేల విరాళం అందజేశారు.

సంక్షిప్త వార్తలు

◆ సన్మానం

హుస్నాబాద్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని సెయింట్ జోసఫ్ హైస్కూల్‌లో మంగళవారం విద్యాదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇదే పాఠశాలలో చదివి స్పోర్ట్స్ కోటాలో యూఎస్‌పీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) ఫలితాల్లో 51వ ర్యాంక్ సాధించిన అన్నడి మధుసూదన్‌రెడ్డిని ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌రెడ్డి సన్మానించారు. మధుసూదన్‌రెడ్డి ఇదే పాఠశాలలో 4 నుంచి 9వ తరగతి వరకు చదివి పీఈటీ కంటి రాజు ఆధ్వర్యంలో సైక్లింగ్‌లో శిక్షణ పొంది 2011లో హైదరాబాద్ స్పోర్ట్స్ స్కూల్ అకాడమీకి ఎంపికయ్యాడు. దాదాపు 20 రోజుల క్రితం ఫలితాలు వెలువడగా, యూఎస్‌పీ ఫలితాల్లో మధుసూదన్‌రెడ్డి ఆల్ ఇండియా 51వ ర్యాంక్ సాధించినందుకు అతని తల్లిదండ్రులు నర్సింహారెడ్డి, సుజాతలను పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌రెడ్డి సన్మానించాడు.

◆ విద్యార్థికి నగదు అందజేత

కోహెడ(హుస్నాబాద్): విద్యా దినోత్సవరంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి పది ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన గోరిట్యాల రుతికకు కో–ఆప్షన్ సభ్యుడు అబ్దుల్‌ఖదీర్ రూ.10వేలు, కోహెడ ఫ్యాక్స్ చైర్మన్ దేవేందర్‌రావు రూ.5వేలు అందజేశారు. అదేవిధంగా 1997–98 పూర్వ విద్యార్థులు ఇటీవల పాఠశాలకు బహూకరించిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. 9.8జీపీఏ, 9.7జీపీఏ సాధించిన పలువురు విద్యార్థులకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాయిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటస్వామి, నాగరాజు, శంకర్, సంపత్‌రావు, తిరుపతిరెడ్డి, విద్యాసాగర్‌గౌడ్, రమేశ్, శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ ధాన్యం తరుగుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

హుస్నాబాద్‌రూరల్: మండలం పందిల్ల గౌరీశంకర్ అగ్రోస్ పారబాయిల్డ్ మిల్లు యాజమానులు ధాన్యం కొనుగోలు చేసిన సమయంలో తరుగు పేరుతో 9 బస్తాలను కోత పెట్టి దోపిడీ చేస్తున్నారని రైతు మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అక్కన్నపేట మండలం పెద్దతండాకు చెందిన గుగులోతు రాంబాబు ధాన్యం కొనుగోలు కేంద్రంలో మే 23న 330 బస్తాల ధాన్యం విక్రయించాడు. పందిల్ల గౌరీశంకర్ అగ్రోస్ పారబాయిల్డ్ మిల్లులో ధాన్యం దిగుమతి చేసే సమయంలో అందులో తరుగు ఉందని 9 బస్తాల ధాన్యం కట్ చేసిన విషయం కొనుగోలు కేంద్రం వాళ్లు రైతుకు ఆలస్యంగా తెలపడంతో మిల్లు యాజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు.

◆ నిందితులను కఠినంగా శిక్షించాలి

చేర్యాల(సిద్దిపేట): రిటైర్డు ఎంపీడీఓ రామకృష్ణయ్యను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో పట్టణ, రూరల్ పార్టీ అధ్యక్షులు సురేందర్, పాండు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రామకృష్ణయ్యను కిడ్నాప్ చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కేసును సీబీఐకి అప్పగించి విచారణ చేయించాలన్నారు. సమావేశంలో నాయకులు రాందాసు, లక్ష్మి, షాదుల్లా, పెంటయ్య, వెంకటేశం, బాబు, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ దురుసుగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

సిద్దిపేటకమాన్: పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తికి సిద్దిపేట కోర్టు జరిమానాతో పాటు జైలు శిక్ష విధించింది. సీఐ రవికుమార్ తెలిపిన వివరాలు పట్టణంలో రెండు రోజుల క్రితం పోలీసు సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పట్టణానికి చెందిన ప్రశాంత్‌కుమార్ దురుసుగా ప్రవర్తించడంతో అతడిపై కేసు నమోదు చేసి సిద్దిపేట కోర్టులో హాజరుపర్చారు. విచారణ జరిపిన న్యాయమూర్తి అతడికి రూ.500 జరిమానాతో పాటు మూడురోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.